

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:32 (మంగళవారం సాయంత్రం) సహర్: 5:00 (బుధవారం ఉదయం)



ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

ప్రజావాణికి 144 ఫిర్యాదులు

వికారాబాద్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రంలో మొత్తం 144 ఫిర్యాదులు వచ్చినట్లు అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇందులో ఎక్కువగా ధరణి భూ సమస్యలు, ఆసరా పెన్షన్లు, ఇరిగేషన్, భూ సర్వే తదితర అంశాలపై దరఖాస్తులు అందినట్లు వెల్లడించారు. సంబంధిత గ్రామాల భూ సమస్యలపై ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేసి వెంటనే రిపోర్ట్ పంపాలని అధికారులను ఆదేశించారు. సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా తక్షణమే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, ఆర్డీవో వాసుచంద్ర, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణను 80 ఫీట్లకు కుదించాలి



అధికారులతో చర్చిస్తున్న వజ్రేశ్‌యాదవ్

కీసర రూరల్, మార్చి17(ఆంధ్ర జ్యోతి): నాగారం నుంచి దమ్మాయిగూడ మీదుగా జవహర్‌నగర్‌కు వెళ్లే రోడ్డు విస్తరణను 100అడుగుల నుంచి 80కి కుదించాలని ఇళ్లు కోల్పోతున్న బాధితులు డిమాండ్ చేస్తున్నారు. సోమవారం టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేశ్‌యాదవ్ రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోతున్న బాధితుల సమస్యల పరిష్కారానికి దమ్మాయిగూడలో మెయిన్ రోడ్డు ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బాధితులతో మాట్లాడుతూ ఇప్పటికే టెండర్ ప్రక్రియ పూర్తయిందన్నారు. రోడ్డు విస్తరణ కుదింపు అసాధ్యమని స్పష్టం చేశారు. అయినా ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో దమ్మాయిగూడ మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ నరేందర్‌రెడ్డి, కమిషనర్ నాగమణి, టీపీవో శ్రీదేవి, రామారావు, సంజీవరెడ్డి, వరగంటి వెంకటేష్ పాల్గొన్నారు.

పనులు చేసే చోట కనీస వసతులు లేక మండుటెండల్లో ఉపాధి కూలీలు మలమలా మాడుతున్నారు. తాగేందుకు నీరు లేదు.. విశ్రాంతి తీసుకుందామంటే నీలువ నీడ లేదు. కూలీలకు ఇవ్వాల్సిన టెంట్ల జాడే లేదు. ప్రమాదవశాత్తు ఎవరికైనా గాయమైనా, వడదెబ్బకు గురైనా వినియోగించేందుకు ప్రథమ చికిత్స కిట్లు అసలే లేవు. సమ్మర్ అలవెన్స్ ఊసే వినబడటం లేదు. దీంతో భయపడిన కూలీలు పనులకు వెళ్లేందుకు జంకుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 2,44,824 మంది కూలీలుండగా 28,956 మంది మాత్రమే పనులకు హాజరవుతున్నారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన క్షేత్రస్థాయి విజిట్‌లో విస్తుపోయే విషయాలు వెలుగుచూశాయి.



కొడంగల్‌లో ఉపాధి పనుల్లో కూలీలు



మాడిపోతున్నం సారూ..

మండుటెండల్లో ఉపాధి కూలీలు విలవిల

- పని ప్రదేశంలో కనీస వసతులు కరువు
- జాడలేని టెంట్లు, అందని తాగునీరు
- సేద తీరేందుకు చిన్నచిన్న చెట్లే దిక్కు
- కానరాని ప్రథమ చికిత్స కిట్లు
- సమ్మర్ అలవెన్స్ ఊసే లేదు
- మందకొడిగా పనులకు వస్తున్న కూలీలు
- ఉపాధి పనుల తీరుపై 'ఆంధ్రజ్యోతి' విజిట్

ఉపాధి పథకం వివరాలు

మండలాలు	20
జాబ్‌కార్డులు	1,32,317
మొత్తం కూలీలు	2,44,824
పనులకు వచ్చేది	28,956

(ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, వికారాబాద్ జిల్లా): సూరీడు నిప్పులు గక్కుతున్నా ఎండలను సైతం లెక్కచేయకుండా పొట్టపోసుకునేందుకు పేద వర్గాలు ఉపాధి పనులకు హాజరవుతున్నారు. నిధులు పుష్కలంగా ఉన్నప్పటికీ కనీస వసతులు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. జిల్లాలోని 20 మండలాల్లో 1,32,317 జాబ్ కార్డులు ఉండగా, 2,44,824 మంది కూలీలు నమోదయ్యారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 5,529 కుటుంబాలకు 100 రోజుల చొప్పున పని దినాలను కల్పించారు. ఫిబ్రవరి నుంచి పనులకు హాజరయ్యే కూలీల సంఖ్య పెరగాలి. ఈ నెలాఖరు వరకు 50 వేల మంది వరకు కూలీలు పనులకు హాజరు కావాల్సి ఉన్నా అంతంతమాత్రంగానే హాజరవుతున్నారు. 10 పని రోజులు పూర్తయిన కూలీలు మళ్లీ పనులకు రావడం లేదు. ఏప్రిల్ నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో కూలీల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. తీవ్ర రూపం దాల్చిన ఎండల కారణంగా

మిగతా 8వ పేజీలో...

చెట్ల కిందనే సేదతీరుతున్నాం



ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో పనులు చేయడానికి ఇబ్బంది పడుతున్నాం. పనులు జరిగే చోట కనీసం తాగునీటి వసతి కూడా ఏర్పాటు చేయడం లేదు. పనులు చేసి అలసిపోయి సేద తీరేందుకు చెట్లను వెతుక్కోవాల్సి వస్తోంది. అక్కడే భోజనం చేయాల్సిన పరిస్థితి. కొన్నేళ్లుగా గడ్డపార, పారలు పంపిణీ చేయడం లేదు. ప్రాథమిక చికిత్స అందించేందుకు కనీసం ఫస్ట్ ఎయిడ్ కిట్లు లేవు. ప్రమాదాల బారిన పడితే పట్టణాలకు వెళ్లి వైద్యం చేయించుకోవాల్సి వస్తోంది.

-హన్మంతు, ఉపాధి కూలీ, ద్యాచారం, వికారాబాద్ మండలం

మేడ్చల్‌లో అనాసక్తి

కేవలం 200 మంది కూలీలే పనులకు హాజరు

మేడ్చల్ జిల్లాలో మొత్తం 1,200 జాబ్‌కార్డులు

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి17(ఆంధ్రజ్యోతి): మేడ్చల్- మాల్కాజ్‌గిరి జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద పని చేసేందుకు కూలీలు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. జిల్లాలో అధిక శాతం అర్బన్ ప్రాంతం కావడంతో కేవలం 61 పంచాయతీల్లో మాత్రమే ఈ పథకం అమలవుతోంది. మేడ్చల్, శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాలల్లో మాత్రమే అక్కడక్కడా ఈ పనులు చేస్తున్నారు. ఇందులో రోజువారీ కూలి చాలా తక్కువ. అదే పని బిల్డర్ల వద్ద చేస్తే రోజు వెయ్యి రూపాయలు వస్తుండటంతో పాటు అడ్డాకు వెళ్తే ఏదో ఓ పని కచ్చితంగా దొరుకుతోంది. దీంతో ఉపాధి హామీ పనులపై ఆసక్తి చూపడం లేదు. ఈ మూడు మండలాల్లో కలిపి మొత్తం 1,200 జాబ్ కార్డులు ఉన్నా రోజువారీగా కేవలం 200 మంది కూలీలు మాత్రమే ఉపాధి హామీ పనులు చేస్తున్నారు. పని చేసే ఈ కొద్దిమంది కూలీలకు సైతం అధికారులు సౌకర్యాలు ఏమీ కల్పించడం లేదు. మంచినీటి సౌకర్యం తప్ప, ఎండకు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. పనులు చేసే సమయంలో ప్రమాదాలు జరిగినా కూలీలకు ప్రథమ చికిత్స చేయడానికి సైతం ఏర్పాట్లు చేయలేదు.



ఉద్దెమర్రిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కుష్ఠువ్యాధి సర్వేకు సహకరించాలి

జిల్లా నిర్మూలన అధికారి రవీందర్‌యాదవ్



సర్వే తీరును పరిశీలిస్తున్న రవీందర్‌యాదవ్

బొంరాస్‌పేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కుష్ఠువ్యాధి సర్వేకు ప్రజలు సహకరించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో, జిల్లా కుష్ఠువ్యాధి నిర్మూలన అధికారి రవీందర్‌యాదవ్ అన్నారు. సర్వేలో భాగంగా సోమవారం ఆయన బొంరాస్పేట్‌లో సర్వే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వేలో ప్రధానంగా శరీర భాగాలపై ఉండే తెల్ల, నల్ల మచ్చలతో పాటు ఇతర రకాల చారలు ఉన్నవారిని గుర్తిస్తున్నామని తెలిపారు. మచ్చలు ఉన్న చోట స్పర్శ లేకపోవడం లాంటి లక్షణాల ద్వారా జిల్లా కుష్ఠువ్యాధిని నిర్ధారిస్తారన్నారు. అలాంటి మచ్చలను ఏమైనా గుర్తిస్తే వెంటనే దగ్గర్లోని పీహెచ్‌సీకి వివరాలు అందించడం జరుగుతుందన్నారు. రోగ నిర్ధారణ తర్వాత వారికి పూర్తి స్థాయిలో ప్రభుత్వమే చికిత్స చేయిస్తుందన్నారు. సర్వేకు వచ్చే ఆరోగ్య సిబ్బందికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని తెలిపారు.

వ్యవసాయ శాఖలో గ్రీవెన్స్ సెల్

జిల్లా వ్యవసాయాధికారి మోహన్ రెడ్డి

వికారాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖకు సంబంధించి రైతుబీమా, రైతుబంధు, రుణమాఫీ, పీఎం కిసాన్, తదితర స్కీములకు సంబంధించిన అధికారులను నియమిస్తూ ప్రత్యేకంగా గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రైతుబీమాకు అనిల్‌కుమార్(జూనియర్ అసిస్టెంట్, సెల్ నంబర్ 99892 91049), రైతుబంధు, పీఎం కిసాన్‌కు ప్రశాంత్(జూనియర్ అసిస్టెంట్ సెల్: 9010339211) , రుణమాఫీ, మిగతా స్కీములు తేజస్ నాయక్(జూనియర్ అసిస్టెంట్ సెల్: 8247373976)ను సంప్రదించాలన్నారు. జిల్లాలోని రైతులు ఇందులోని ఏ ప్రభుత్వం పథకాలకు సంబంధించిన ఎటువంటి సమాచారానికైనా సంబంధిత అధికారులను ఫోన్లో సంప్రదించవచ్చన్నారు.

పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- మేడ్చల్ కలెక్టర్ గౌతమ్



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ ప్రతినిధి, మార్చి17: కొంత మంది అధికారులు తమ తీరు మార్చుకోవాలని, ప్రజావాణి ఫిర్యాదులపై బాధ్యతగా స్పందించాలని కలెక్టర్ గౌతమ్ హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ఏ కారణం చేతనైనా పరిష్కరించడం కుదరకపోతే వెంటనే తిరస్కరించాలన్నారు. ప్రజావాణిలో మొత్తం 73 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్‌వో హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల్లో ఎస్సీ లబ్ధిదారులపై ఆరా

ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాలలో జిల్లా వ్యాప్తంగా ఎస్సీలకు ఎంత శాతం లబ్ధి చేకూరుతుందనే అంశాలపై సోమవారం కలెక్టర్ గౌతమ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ సభ్యులు మంగళవారం జిల్లాకు రానున్న సందర్భంగా ఆయన సమీక్ష నిర్వహించారు. వివిధ సంక్షేమ శాఖల ద్వారా అందించే రైతు భరోసా, రైతుబీమా, రుణమాఫీ, గృహలక్ష్మి, స్వయం సహాయక సంఘాల రుణాలు, మహిళా శక్తి, తదితర పథకాల అమలులో ఎంత మంది ఎస్సీలకు లబ్ధి చేకూరిందనే లెక్కలను తెలుసుకున్నారు. సమీక్షలో డీఆర్‌వో హరిప్రియ, ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి వినోద్‌కుమార్, సీపీవో శేఖర్, జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ, డీఈవో విజయకుమారి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత, హౌజింగ్ ఈఈ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

- ఆస్తి పన్ను వసూళ్లలో వెనుకబడిన తాండూరు మున్సిపాలిటీ
- పెండింగ్‌లో రూ.1.57 కోట్ల పన్ను
- బకాయిదారులకు రెడ్ నోటీసులు అందజేత
- ఆందోళనలో గృహ యజమానులు
- విస్తృత ప్రచారానికి ఉన్నతాధికారుల ఆదేశం



తాండూరు మున్సిపల్ కార్యాలయం



ఇంటికి నోటీసు అంటిస్తున్న సిబ్బంది(ఫైల్)

వసూలు చేయాల్సిందే!

నిర్దేశించిన వృద్ధిరేటు సాధించకుంటే కేంద్ర గ్రాంట్లు బంద్.. మున్సిపాలిటీలకు అల్టిమేటం

తాండూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను వసూళ్లకు కేంద్రం నూతన విధివిధానాలను రూపొందిస్తోంది. సూచించిన వృద్ధి రేటును సాధించాలని, అలా జరగకపోతే మున్సిపాలిటీలకు కేంద్రం ఇచ్చే గ్రాంట్లను నిలిపివేయనున్నారు. స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి(జీఎస్‌డీపీ), లేదా రాష్ట్ర ఆదాయం రాష్ట్ర ఆర్థిక వృద్ధిని కొలవడానికి సూచికగా వృద్ధి రేటును పరిగణిస్తారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను రాష్ట్ర జీఎస్‌డీపీ 12.09గా నిర్ధారించారు. కాగా, తాండూరు మున్సిపాలిటీ పరిధిలో రూ.12.09 కోట్లు సాధించాల్సిందిగా లక్ష్యాన్ని నిర్దేశించారు.

విస్తృత ప్రచారానికి ఆదేశం

ఇందులో భాగంగా ప్రతి రోజు గ్రూపుగా మేసేజ్ పంపాలి. బిల్ కలెక్టర్లకు రోజువారీగా రశీదుల టార్గెట్ ఇవ్వాలి. ఒక్క బిల్ కలెక్టర్ నుంచి కనీసం 10 రశీదులకు తక్కువ రాకుండా చూడాలి. 19 మార్చి 2025 వరకు ప్రతి బిల్ కలెక్టర్ 65శాతం కలెక్షన్ సాధించాలి. 31 మార్చి 2025 వరకు వంద శాతానికి చేరుకోవాలి.

మిగిలింది మరో 13 రోజులు మాత్రమే..

నిర్ధారించిన వృద్ధిరేటును సాధించకపోతే తాండూరు మున్సిపాలిటీకి కేంద్ర ప్రభుత్వం అందజేసే 15వ ఆర్థిక సంఘం, రాష్ట్రం విడుదల చేసిన ఎస్ఎఫ్‌సీ నిధులు నిలిచిపోనున్నాయి. ఈ వృద్ధి రేటును సాధించాలంటే రూ1.57కోట్ల ఆస్తి పన్ను వసూలు చేయాల్సింది. ఈ పన్నులను మార్చి 31లోపు వసూలు చేయాల్సి ఉంటుంది. ఇందుకు కేవలం మరో 13 రోజుల గడువు మాత్రమే ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.4 కోట్ల 31 లక్షల ఆస్తి పన్ను వసూలు చేశారు. ఈ ఏడాది ఇప్పటివరకు రూ.3 కోట్ల 30 లక్షలు మాత్రమే వసూలైంది.


రెడ్ నోటీసులు జారీ

మొండి బకాయిదారులకు తాండూరు మున్సిపాలిటీలో రెడ్ నోటీస్‌లను జారీ చేస్తున్నారు. తెలంగాణ మున్సిపాలిటీల చట్టంలోని 90వ సెక్షన్ ప్రకారం చరాస్తి, స్థిరాస్తులు జప్తు చేసేందుకు నిర్ణయించినట్లు ఆ నోటీసులో పేర్కొంటున్నారు. ఫ్రీ వారెంటు నోటీసు ముట్టిన 15 రోజుల్లో ఆస్తి పన్ను చెల్లించాలని, లేనిచో ఆస్తులు జప్తు చేస్తామని హెచ్చరిస్తున్నారు. సదరు యజమాని నోటీసు తీసుకోకపోతే నోటీసును సిబ్బంది ఇంటికి అతికించి వెళ్తున్నారు. ఈ విషయంలో సిబ్బంది వ్యవహరిస్తున్న తీరుపై పట్టణ ప్రజలు పెదవి విరుస్తున్నారు. కమిషనర్ ఒత్తిడి మేరకే ఇలా వ్యవహరించాల్సి వస్తోందని సిబ్బంది చెబుతున్నారు. గతంలో బకాయిదారులకు నోటీసులు ఇచ్చారే తప్ప ఇంటికి నోటీసులు అంటించిన దాఖలాలు లేవని, ఈ ఏడాది ఇలా అంటిస్తున్నారని వాపోతున్నారు.

10కిలోల గంజాయి పట్టివేత



ఘట్‌కేసర్ రూరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : అక్రమంగా రవాణా చేస్తున్న పది కిలోల గంజాయితో పాటు, నిందితుడిని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. భువనేశ్వర్ నుంచి ముంబాయికి కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నట్లు సమాచారం తెలుసుకున్న టాస్క్ ఫోర్స్ టీం ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానంగా కనిపించిన ఒడిశాకు చెందిన నందిగోస నాహక్(21)ను అదుపులోకి తీసుకుని 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దాంపాప్రధాన్ అనే వ్యక్తి ముంబాయికి 10 కిలోల గంజాయి తరలించేందుకు నాహక్‌తో రూ.15వేలకు ఒప్పందం చేసుకున్నట్లు విచారణలో తెలింది. నాహక్ నుంచి 10 కిలోల గంజాయితో పాటు సెల్‌ఫోనును స్వాధీనం చేసుకోని అతన్ని అరెస్టు చేసి, గంజాయి వ్యాపారి దాంపాప్రధాన్‌పై కేసు నమోదు చేశారు.



7

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి

భారతీయ జనతా పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ రాజశేఖర్‌రెడ్డిని నియమించారు. ఈ మేరకు సోమవారం పార్టీ రాష్ట్ర ఎన్నికల అధికారి ఎండల లక్ష్మీనారాయణ, కో-రిటర్నింగ్ అధికారి గీతామూర్తి ప్రకటన చేశారు. అలాగే మూడు నియోజకవర్గాల నుంచి నలుగురిని రాష్ట్ర కౌన్సిల్ సభ్యులను నియమించారు.

కడ్తాల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి):రాజీవ్ యువ వికాసం పథకం నిరుద్యోగ యువత ఉద్యోగ, ఉపాధికి దోహదపడుతుందని పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. యువత ఉపాధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. అసెంబ్లీ ప్రాంగణంలో సీఎం రేవంత్ రెడ్డి నిరుద్యోగ యువతు

ఉపాధి కోసం 'రాజీవ్ యువ వికాసం'

స్వయం ఉపాధి కల్పించడానికి రాజీవ్ యువ వికాస పథకాన్ని ప్రారంభించడం హర్షణీయమని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కడ్తాలలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఈ పథకంతో 5లక్షల మందికి స్వయం ఉపాధి కోసం రూ.6వేల కోట్ల సబ్సిడీ రుణాలను ప్రభుత్వం ఇస్తుందని చెప్పారు. ఒక్కో లబ్ధిదారుకు రూ.4లక్షల రుణ ఇస్తారని, ఇందులో 60-80శాతం వరకు రాయితీ ఇస్తారని తెలిపారు. రాజీవ్ యువ వికాస పథకంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువత జీవితాల్లో వెలుగు నిండడం ఖాయమన్నారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి జి.శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బిక్యానాయక్, యాట నర్సింహ, బిచ్యానాయక్, వెంకటేశ్, మల్లేశ్‌గౌడ్, హీరాసింగ్, జవహర్‌లాల్, తులసీరామ్, రవి, రాజేశ్, లక్ష్మయ్య ఉన్నారు.

కార్తీక్‌రెడ్డిని కలిసిన జయసింహ

శంషాబాద్ రూరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కార్తీక్‌రెడ్డిని సోమవారం రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని శంషాబాద్ మున్సిపాలిటీకి చెందిన రాచమల్ల జయసింహ మర్యాదపూర్వకంగా కలిశారు. గత ఎన్నికల్లో బీఎస్పీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన కార్తీక్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సన్మానించారు. బీఎస్పీ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరడంతో జయసింహ సైలెంట్‌గా ఉండిపోయారు. కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పటిష్ఠతకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పవిత్రసాగర్, భాస్కర్, రాచమల్ల రాజ్‌కుమార్, సందీప్, శ్రవణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

మాడ్గుల, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని అందుగుల గ్రామానికి చెందిన కొప్పుల మహేష్ అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నాడు. ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి సహకారంతో మంజూరైన రూ.42వేల చెక్కును సోమవారం ప్యాక్స్ డైరెక్టర్ జగన్, మాజీ సర్పంచ్ జయలక్ష్మీరాజు అందజేశారు. శ్రీనివాస్, రమేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కందుకూరులో..

కందుకూరు: మండలంలోని అగర్‌మియాగూడకు చెందిన సునీతకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును మాజీ ఉప సర్పంచ్ రేవంత్ రెడ్డి అందజేశారు. ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి చొరవతో రూ.60వేలు మంజూరయ్యాయని తెలిపారు.

రిజర్వాయర్‌కు నిధులు కేటాయించండి

షాద్‌నగర్ అర్బన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించాల్సిన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌కు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని పాలమూరు అధ్యయన వేదిక రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కర్ణకోట రవీంద్రనాథ్ డిమాండ్ చేశారు. సోమవారం మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బడ్జెట్‌లో లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమయ్యే నిధులు కేటాయించి, పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న అశోక్

మేడ్చల్ ప్రతినిధి, మార్చి 17(ఆంధ్రజ్యోతి):కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అశోక్ డిమాండ్ చేశారు. సోమవారం మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ పిలుపు మేరకు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాలతో ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేయ చూస్తోందని ఆరోపించారు. ఈ విధానాలకు వ్యతిరేకించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సునిత, శోభారాణి, సీఐటీయూ కార్యదర్శి చంద్రశేఖర్, కిష్టప్ప, శ్రీనివాసులు, లింగస్వామి, వెంకన్న, గణేష్, ఉన్ని కృష్ణ, శివరాణి, శైలజ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న కల్యాణోత్సవం

మేడ్చల్ టౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మల్లికార్జున స్వామి(మల్లన్న) కల్యాణ మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్దఎత్తున వేడుకల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్ పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. అదేవిధంగా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేముల శ్రీనివాస్‌రెడ్డి, మర్రి నర్సింహారెడ్డి, శంకర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు



కబిచంద్ర

కీసర రూరల్, మార్చి17(ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నిందితుడికి జీవత ఖైదు విధిస్తూ సోమవారం కోర్టు తీర్పిచ్చింది. కీసర ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. గోధుమకుంటలో ష్యూర్ ఫీడ్ సెంటర్ కొనసాగుతోంది. అందులో ఒడిశాకు చెందిన బబ్లూ బడానాయక్, కబిచంద్ర కూలీలుగా పనిచేస్తున్నారు. పని విషయంలో బబ్లూ, కబిచంద్రల మధ్య గొవలొస్తుండేవి. 2024 మార్చి 10న కోడి పిల్లల దిగుమతిలో వారిద్దరి మధ్య పేచీ వచ్చింది. దీంతో కక్షపెంచుకున్న కబిచంద్ర అదేరోజు మద్యం తాగి బబ్లూ ఇంటికి వెళ్లి గొడవపడ్డాడు. తనతో తెచ్చుకున్న కత్తితో బబ్లూను పొడిచాడు. తీవ్ర గాయాలైన బబ్లూను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బబ్లూ కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేశారు. ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య కోర్టుకు సాక్ష్యాధారాలను సమర్పించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ యాదగిరి కేసు వాదించారు. విచారణ అనంతరం మల్కాజ్గిరి కోర్టు జడ్జి బాలభాస్కర్ కబిచంద్రకు జీవిత ఖైదు, వెయ్యి రూపాయల జరిమానా విధించారు. వేగవంతంగా కేసు విచారణ చేపట్టి నిందితుడికి శిక్షపడేలా చేసిన పోలీసు అధికారులను రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు అభినందించారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

తాండూరు రూరల్,మార్చి17(ఆంధ్రజ్యోతి): సమాజంలో జరుగుతున్న నేరాలను, నేరస్తులను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని వికారాబాద్ జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం కరన్‌కోట్ పోలీసుస్టేషన్‌లో అదానీ సిమెంట్ కంపెనీ అందజేసిన సీసీ కెమెరాలు, కరన్‌కోట్ ఎస్‌బీఐ మేనేజర్ అందజేసిన బారికేడ్లను ఎస్‌ఐ కె.విఠల్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ.. ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులు, వెయ్యి కళ్లతో సమానమన్నారు. కెమెరాల ఫుటేజీలను ఎవరూ మార్చలేరన్నారు. అదానీ కంపెనీ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ కింద సీసీ కెమెరాలు అందంజేయడం గొప్ప విషయం అన్నారు. అలాగే సమీప గ్రామాల్లో సిమెంట్స్ కంపెనీ యాజమాన్యం, గ్రామాల ప్రతినిధుల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నారన్నారు. కొందరు కోట్లాది రూపాయలు వెచ్చించి ఇళ్లు నిర్మించుకున్నా సీసీ కెమెరాలు మాత్రం ఏర్పాటు చేసుకోవడం లేన్నారు. సొంతిళ్లు, పంచాయతీలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. డీఎస్పీ బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. తాండూరు ప్రాంతంలో అదానీ సిమెంట్స్, అల్ట్రాటెక్ సిమెంట్స్ వారు సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించడం అభినందనీయమన్నారు. సీసీ కెమెరాల వల్లే ఇక్కడ గతంలో బాలిక అదృశ్యం, బాలుడి అపహరణ, లారీ ఢీకొట్టిన సంఘటన వంటి కేసునుల ఛేదించామని చెప్పారు. మాజీ ఎంపీటీసీ నరేందర్‌రెడ్డి(సాయిరెడ్డి) కెమెరాల ఏర్పాటుకు రూ.50వేలు అందజేశారు. కార్యక్రమంలో రూరల్ సీఐ నగేష్, అదానీ సిమెంట్స్ వైస్‌చైర్మన్ రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శరణుబసప్ప, మాజీ ఎంపీటీసీలు రాజ్‌కుమార్, నాయకులు వీరేందర్‌రెడ్డి, శకుంతల, ఆర్సీగౌడ్, వెంకట్‌రాంరెడ్డి, జెర్నె నాగప్ప, నారాయణరెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, ఉదయ భాస్కర్‌రెడ్డి, జర్నప్ప, అజ్మత్‌అలీ, సుధాకర్, రాజ్‌కుమార్, విజయ్‌కుమార్, రఘునాథ్‌రెడ్డి, ప్రవీణ్‌గౌడ్, రాంచంద్రారెడ్డి ఉన్నారు. అనంతరం రవీంద్రనాథ్‌రెడ్డి, ఎస్‌బీఐ మేనేజర్‌ను, స్థలదాత రాంరెడ్డిలను ఎస్పీ సన్మానించారు. ప్రజాప్రతినిధులు ఎస్పీని సత్కరించారు.

సైబర్ నేరాల నియంత్రణపై ప్రచారం

తాండూరు:సైబర్ నేరాలను అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలను చేపడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి చెప్పారు. సోమవారం తాండూరులోని వినాయక కన్వెన్షన్‌లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ), పోలీసు శాఖ ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఎస్పీ పాల్గొన్నారు. ప్రజలు మోసపోతున్న సైబర్ క్రైమ్‌లపై చైతన్య, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. తాండూరు నుంచే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. 600వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. 1920కు డయల్ చేయడం, ఎలాంటి మోసాలు చేస్తారు తదితర వివరాలతో పోస్టర్లను రూపొందించారు. కార్యక్రమంలో డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, అర్బన్, రూరల్ సీఐలు సంతోష్‌కుమార్, నగేష్, ఐఎంఏ స్థానిక ప్రెసిడెంట్ డాక్టర్ జయప్రసాద్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ అనిల్‌కుమార్‌రెడ్డి, వైద్యులు సంతోష్, శివమోహన్‌రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షులు సంతోష్ ఆటోడ్రైవర్లకు టీషర్ట్ పంపిణీ చేశారు.

భగత్‌సింగ్ కలలుగన్న సమాజ నిర్మాణానికి కృషి చేయాలి

ఘట్‌కేసర్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): భగత్‌సింగ్ కలలుగన్న నవసమాజ నిర్మాణం కోసం యువత కృషిచేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అవినాష్, కార్తీక్ అన్నారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం ఘట్‌కేసర్‌లో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ చేసిన త్యాగం ఎంతో గొప్పదన్నారు. సకల వనరులున్నా నేటికీ దేశ ప్రజలు పేదరికంలో మగ్గడం బాధాకరమన్నారు. విద్యార్థులు చరిత్రను అధ్యయనం చేయాలన్నారు. పరాయి పాలకులను దేశం విడిచిపోవాలని శాసించిన యోధుల త్యాగాలను స్మరించుకోవడం నేటితరం బాధ్యత అని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ మండల అధ్యక్షుడు అనిల్, కార్యదర్శి మనోజ్, సుబ్బు, శ్యామ్, వినయ్, శ్రీరామ్, జితేందర్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థులు

ఎస్సీ వర్గీకరణ జరిగే వరకు ఉద్యమం


చేవెళ్లలో నిరసన దీక్ష చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చేవెళ్ల, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తేనే మాదగల బతుకులు మారుతాయని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి బాత్యాల శివశంకర్, చేవెళ్ల మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం చేవెళ్లలో నిరాహార దీక్షలు నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పోరాటాల ఫలితంగా ఎస్సీ వర్గీకరణ సాకారం అవుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణ మాదిగల 70సంవత్సరాల ఆకాంక్ష అన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీ వెంటనే ఆమోదించి అమలు చేయాలన్నారు. వర్గీకరణ చట్టం చేసే వరకు ఉద్యమం ఆగదన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు భానుప్రసాద్, నాయకులు రాములు, మల్లేష్,వెంకటేశ్, రాజు, కుమార్, సత్యనందం, గుండు ఆశోక్, వినోద్‌కుమార్, విజయ్‌కుమార్, ప్రసాద్, శాంతికుమార్, లింగం తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లి: ఎస్సీ వర్గీకరణ చట్టం చేశాకే ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. మాదిగలకు అన్యాయం జరిగితే ఎంతటి పోరాటానికైనా వెనుకాడం అని స్పష్టం చేశారు. తలకొండపల్లిలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎఫ్‌ల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారంతో ఏడో రోజుకు చేరాయి. దీక్షలను బీఆర్‌ఎస్ నాయకులు శేఖర్‌యాదవ్, గౌడ సంఘం కల్వకుర్తి నియోజకవర్గ కన్వీనర్ మోకురాల అశోక్ గౌడ్ సందర్శించి సంఘీబావం తెలిపారు. దీక్షలో నాయకులు గోపాల్, శరత్‌చంద్ర, మార్కండేయ, రజనీకాంత్, సురేశ్, దయాకర్, రాజు, జలేందర్, మహేశ్, శ్రీశైలం, జగన్, గిరిప్రసాద్ కూర్చున్నారు. వర్గీకరణ చట్టం చేసి గ్రూప్స్, హెచ్‌డబ్ల్యూవో పోస్టుల నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేదంటే మాదిగలు, ఉప కులాల అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే వర్గీరణ చట్టం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎఫ్ నాయకులు శ్రీకాంత్, కుమార్, యాదయ్య, రాజు, వీరేశ్, సురేశ్, మల్లయ్య, శశికాంత్, కిరణ్, వంశీ, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.


తలకొండపల్లి : నిరాహార దీక్షలో ఎమ్మార్పీఎస్ నాయకులు

షాద్‌నగర్ అర్బన్: ఎస్సీ వర్గీకరణ తర్వాతే రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నియామకాలను చేపట్టాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. షాద్‌నగర్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఎనిమిదో రోజుకు చేరుకుంది. సోమవారం నాయకులు అర్ధనగ్న ప్రదర్శన చేసి నిరసన తెలిపారు. దీక్షకు హాజరైన ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ మాదిగ మాట్లాడుతూ.. మంద కృష్ణ ముప్పై ఏళ్ల పాటు సుదీర్ఘ పోరాటం చేసి, ఎస్సీ వర్గీకరణ అమలుకు మార్గాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణను అమలు చేస్తేనే మాదిగలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. నిరసన కార్యక్రమంలో నాయకులు బాల్‌రాజ్ మాదిగ, సుదర్శన్ మాదిగ, సురేష్, శ్రీనివాస్ మాదిగ, శేఖర్ మాదిగ, రాజు, నవీన్, రాకేష్, సతీష్, నాగేష్, సీతారాం తదితరులు పాల్గొన్నారు.


షాద్‌నగర్‌లో అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న నాయకులు

ఎండిన వరి పంట

- లబోదిబోమంటున్న రైతులు
- అప్పులు మిగిలాయని ఆందోళన


యాచారం మండలం చిన్నతూండ్లలో ఎండిపోయిన వరి చేనులో మేస్తున్న పశువులు

యాచారం/ఆమనగల్లు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలో యాసంగిలో సాగుచేసిన వరి పంట ఎండుతోంది. మూడేళ్లుగా వర్షాలు బాగా కురియక భూగర్భజలం గణనీయంగా పడిపోవడంతో బోర్లు పోయక వరి పంటలు ఎండుతున్నాయి. దిక్కుతోచక రైతులు లబోదిబోమంటున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో 185ఎకరాలకుపైగా వరి పంటలు ఎండిపోయినట్లు రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఎండలు ముదురుతుండడం, నీటిమట్టం పడిపోతుండడంతో రానున్న 20రోజుల్లో మండలంలో ఐదారు వందల ఎకరాల్లో వరి పంట ఎండిపోవచ్చని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరం వరి సాగుకు రూ.45వేల పెట్టుబడి పెట్టామని, అప్పు చేసి వరి వేస్తే పంటంతా ఎండి అప్పులే మిగిలాయని చిన్నతూండ్ల, నల్లవెల్లి తదితర గ్రామాల రైతులు రాజయ్య, కిష్టయ్య, దర్శన్ ఆవేదనచెందారు. కళ్లముందే పంట ఎండిపోతుండడంతో గుండె చెరువవుతోందని రైతులంటున్నారు. ధర్మన్నగూడలో 10ఎకరాలు, కొత్తపల్లిలో 22 ఎకరాలు, చిన్నతూండ్లలో 15 ఎకరాలు, కుర్మిద్ద, తాటిపర్తి, మేడిపల్లి, నానక్‌నగర్ గ్రామాల్లో 60 ఎకరాలు, మంతన్‌గౌరెల్లి, శ్రీమంతగూడ, మాల్, నల్లవెల్లి తదితర గ్రామాల్లో 82ఎకరాల్లో వరి పంట ఎండుతోంది. అలాగే ఆమనగల్లు మండలంలో యాసంగి సీజన్‌లో 4,600 ఎకరాల్లో వరి పంట సాగుచేశారు. భూగర్భ జలాలు అడుగంటుతుండడంతో పంటలను కాపాడుకునేందుకు అన్నదాతలు తిప్పలు పడుతున్నారు. దీనికి తోడు కరెంటు కోతలు తోడవడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఎండిన వరి చేలలో పశువులను మేపుతున్నారు.

ఇప్పటికే మూడెకరాల వరి ఎండిపోయింది



పది ఎకరాల్లో వరి పంట సాగు చేశాను. అందులో ఇప్పటికే మూడు ఎకరాల వరి పంట ఎండిపోయింది. బోర్లలో నీరు తగ్గి మిగిలిన 7ఎకరాల వరి పంటైనా చేతికందుతుందనే నమ్మకం లేదు. ఎకరం పొలం సాగుకు రూ.45వేల పెట్టుబడైంది. పంటంతా ఎండితే రూ.4.5లక్షల అప్పులు మిగులుతాయి. ప్రభుత్వం ప్రకృతి విపత్తు కింద ఆర్థిక సాయం అందించాలి.

- ప్రదీప్‌రెడ్డి, రైతు, ధర్మన్నగూడ, యాచారం మండలం

రోజుకు 5గంటల విద్యుత్ కోత

మండలంలో రోజూ 5గంటల పాటు విద్యుత్ కోత విధిస్తున్నారు. రోజూ సాయంత్రం 6 నుంచి రాత్రి 11గంటల వరకు సింగిల్ ఫేజ్ కరెంటు, అక్కడి నుంచి త్రీఫేజ్ సరఫరా ఇస్తున్నారు. రైతులు రాత్రి వేళ పొలాలకు వెళ్లలేక ఉదయం నాలుగున్నర గంటలకు పొలం వెళ్లి పంటలకు నీరు పెడుతున్నామని కొత్తపల్లికి చెందిన రైతు జంగయ్య చెప్పారు. త్రీ ఫేజ్ సరఫరాలో కూడా తరచూ అంతరాయం కలుగుతోందని రైతులు చెబుతున్నారు.


యాచారం మండలం కొత్తపల్లిలో ఎండిపోయిన వరి చేను


ఆమనగల్లు మండలంలో నీరందని వరి చేను

కరన్‌కోట్‌లో కొత్త రేషన్ కార్డుల జారీ

తాండూరు రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కరన్‌కోట్‌లో 190 మందికి సోమవారం కొత్త రేషన్ కార్డులను జారీ చేసి సరుకులను అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే రేషన్ కార్డులివ్వడంతో సరుకులు అందాయని మాజీ ఎంపీటీసీ రాజ్‌కుమార్ పేర్కొన్నారు.

పారిశుధ్య పనులు చేయాలి

కులకచర్ల, మార్చి17(ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని ఎంపీవో భాస్కర్‌గౌడ్ తెలిపారు. ముజాహిద్‌పూర్‌లో సోమవారం పర్యటించి పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు

సైన్స్ ఫెయిర్‌తో మేధస్సు పెంపు

తాండూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): సైన్స్ ఫెయిర్లతో విద్యార్థుల మేధస్సు పెరుగుతుందని శ్రీ చైతన్య కళాశాల ప్రిన్సిపాల్ షేక్ మాదన్ అన్నారు. సైన్స్ ఫెయిర్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు సోమవారం ఆయన సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పూడూరు: విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న టీచర్లు

వికారాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): నవాబుపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం శిక్షణ ఫౌండేషన్, విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఎంఈవో అబ్దుల్ రహెమాన్ మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికితీసేందుకు దోహదపడతాయని తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఎంఈవో, హెచ్‌ఎం మల్లేశం ప్రశంసపత్రాలు అందించి అభినందించారు. ఫౌండేషన్ ప్రతినిధులు రాజు, లక్ష్మి, నారాయణ, యాదయ్య పాల్గొన్నారు.

పూడూరు: ది హన్స్ ఫౌండేషన్ దాతల సహకారంతో శిక్షణ ఫౌండేషన్, విద్యాశాఖ వికారాబాద్ ఆధ్వర్యంలో మేడిపల్లికలాన్ పాఠశాలలో సోమవారం కాంప్లెక్స్ స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో 9 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా మేడిపల్లి, అంగడి చిట్టంపల్లి పాఠశాల విద్యార్థులు పోటీపడగా అంగడిచిట్టంపల్లి స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారు. విద్యార్థులకు ప్రేరణ పురస్కార్ సర్టిఫికెట్లు అందజేశారు. హెచ్‌ఎం శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఇంటి వద్దకే భద్రాద్రి రామయ్య ముత్యాల తలంబ్రాలు

పరిగి రూరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఇంటి వద్దకే భద్రాద్రి రామయ్య ముత్యాల తలంబ్రాలు పంపిణీ చేసేందుకు టీజీఎస్‌ఆర్టీసీ సిద్ధమైందని రంగారెడ్డి రీజియన్ లాజిస్టిక్ ఏటీఎం రవీందర్ సోమవారం తెలిపారు. భద్రాచలంలో ఏప్రిల్ 6న సీతారాముల కల్యాణం జరగనుండగా, ఉత్సవాలకు వెళ్లలేని భక్తులు తలంబ్రాలను ఆర్టీసీ కార్గో ద్వారా పొందొచ్చన్నారు. రూ.151చెల్లించి బుకింగ్ చేసుకోవచ్చని, ఈ నెల 12 నుంచి ఏప్రిల్-7 వరకు బుకింగ్ ఉంటుందని తెలిపారు. తలంబ్రాల కోసం ప్రజలు.. వికారాబాద్ ప్రాతం- 9154298740/ 9177636149, పరిగి-9154298738/ 9162513332, తాండూరు 9154298739/ 9830931549, రంగారెడ్డి ఆర్‌ఎమ్‌ఈ వారు 9154298733 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

డ్వాక్రా మహిళల డబ్బు స్వాహా

ఘట్‌కేసర్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): నెలనెలా అప్పు కింద బ్యాంక్‌లో జమచేయాల్సిన డబ్బును స్వాహాచేసిన సూపర్‌వైజర్(వీవోఏ)పై చర్యలు తీసుకోవాలని డ్వాక్రా మహిళలు డిమాండ్ చేస్తున్నారు. పోచారం పరిధి చౌదరిగూడలో రెండేళ్ల క్రితం డ్వాక్రా మహిళలు శ్రీనిధి రుణాలు తీసుకున్నారు. వీరు క్రమం తప్పకుండా బాకీ కింద వీవోఏకు, గ్రూప్ లీడర్‌కు చెల్లించే వారు. అయితే వారిద్దరూ డబ్బులు బ్యాంకులో సక్రమంగా చెల్లించలేదు. రెండేళ్ల క్రితం నిర్వహించిన ఆడిట్‌లో రూ.7లక్షలు తేడా వచ్చింది. విచారణ చేసిన అధికారులు వీవోఏ సువర్ణ, అప్పటి లీడర్ డబ్బు స్వాహా చేశారని తేల్చారు. అధికారుల ఒత్తిడితో అధ్యక్షురాలు రూ.3.5లక్షలు చెల్లించింది. వీవోఏ సువర్ణ మాత్రం సొంతానికి వాడుకున్న డబ్బు చెల్లించలేదు. అధికారులు గ్రూపుల సభ్యులకు అప్పు చెల్లించాలని నోటీసులు జారీచేశారు. తాము సువర్ణకు రెగ్యులర్‌గా కట్టామనుకున్న మహిళలు.. నోటీసులతో ఆందోళనకు గురై ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.ఈ విషయమై ఏపీఎం తౌర్యానాయక్ స్పందిస్తూ.. రెండేళ్లుగా సంస్థకు డబ్బు చెల్లించలేదని, గతంలోనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు.

20న తైబజార్ వేలం

కొడంగల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న కొడంగల్ మున్సిపల్ తైబజార్ వేలం నిర్వహిస్తామని కమిషనర్ బలరాంనాయక్ సోమవారం పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు రూ.50వేల డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు మంగళవారం గడువు అని తెలిపారు.

వికారాబాద్‌లో ఎన్‌సీసీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలి


కేంద్ర మంత్రి సంజయ్ సేత్‌తో మాట్లాడుతున్న ఎంపీ కె.విశ్వేశ్వర్‌రెడ్డి

వికారాబాద్/పరిగి రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్‌లో ఎన్‌సీసీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కోరారు. సోమవారం ఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్‌సేత్‌ను కలిసి విన్నవించారు. మారుమూల ప్రాంతాల విద్యార్థులకు ఎన్‌సీసీ యూనిట్ ఉపయోగకరమని మంత్రికి వివరించారు. క్రమశిక్షణ, దేశభక్తి, ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ లభించే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటికే ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లేఖ రాశారని గుర్తు చేశారు. వికారాబాద్‌లోని అనంతపద్మనాభ స్వామి కాలేజీ యాజమాన్యం కూడా ఎన్‌సీసీ యూనిట్ ఏర్పాటుకు సిద్ధంగా ఉందని, ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్‌కు లేఖ పంపారని వెల్లడించారు. ఇందుకు కేంద్ర రక్షణ శాఖ సానుకూలంగా స్పందించడంతో వికారాబాద్ వాసుల ఆశ నిజమవుతుందని ఎంపీ విశ్వాసం వ్యక్తం చేశారు.

జర్నలిస్టులపై సీఎం వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

కడ్తాల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యమని, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. ప్రభుత్వం ప్రతికాస్వేచ్ఛను హరిస్తోందని సోమవారం కడ్తాలలో లంబాడా హక్కుల పోరాటా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్‌నాయక్, నాయకులు అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు జర్నలిస్టులపై చూపిన ప్రేమ ఏమైందని, అది కపట ప్రేమేనా? అని ప్రశ్నించారు. వస్తులుండి తెలంగాణ ఉద్యమం చేసిన జర్నలిస్టుల వల్లే ఈ రోజు ఆయన ముఖ్యమంత్రి అయ్యారని అన్నారు. వ్యక్తిగత విమర్శలు చేసే వారిపై చట్టపర చర్యలు తీసుకోవాలని గానీ.. 'బట్టలూడదీసి కొడ్తా, రోడ్లపై ఉరికిస్తా.' అని అనడం ముఖ్యమంత్రికి తగదన్నారు. కేసీఆర్‌ను అసభ్యకరంగా మాట్లాడితే సహించేది లేదన్నారు. సీఎం అసెంబ్లీలో క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు రమేశ్, పాండునాయక్, సిద్ధిగారి వెంకటేశ్, జి.రామచంద్రయ్య, నాగార్జున, అంజి, శ్రీను, కుమార్, వాచ పాల్గొన్నారు.

పట్టా భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలి

రంగారెడ్డి అర్బన్, మార్చి17(ఆంధ్రజ్యోతి): రైతుల పట్టా భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య డిమాండ్ చేశారు. సోమవారం రంగారెడ్డి అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఫార్మాసిటీలో అసైన్డ్, పట్టాభూములతో పాటు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు భూములు కోల్పోయిన రైతులకు వెంటనే పరిహారమివ్వాలని కోరారు. నిర్వాసితులకు 121చదరపు గజాల ఇంటి స్థలం ఇచ్చారని, దానికి 500చదరపు గజాలకు పెంచి ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.15లక్షలివ్వాలని కోరారు. గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ఓఆర్‌ఆర్ ఎగ్జిట్ 13నుంచి మీర్‌ఖాన్‌పేట మీదుగా ఆకుతోటపల్లి ఆర్‌ఆర్‌ఆర్ వరకు నిర్మించ తలపెట్టిన 300ఫీట్ల రోడ్డు విస్తరణకు భూములు కోల్పోతున్న వారికి ఎకరానికి వెయ్యి గజాల చొప్పున ఇంటి స్థలం ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకులు కాడిగల్ల భాస్కర్, సామేలు, చంద్రమోహన్, రాంచందర్, జగదీష్, నర్సింహ, జగన్, కవిత ఎ.నర్సింహ, జంగయ్య, బి.రాములు, రాజు, శోభన్, జంగయ్య, పి.అంజయ్య, శ్యాంసుందర్, శ్రీనివాస్‌రెడ్డి, రుద్రకుమార్, కిషన్, నర్సింహ, నర్సిరెడ్డి, కె.సుమలత ఉన్నారు.

బోర్ మోటార్ చెడిపోయి తాగునీటికి ఇబ్బందులు


ధారూరు స్టేషన్ కాలనీలో ఖాళీ బిందెలు, బకెట్లతో మహిళల నిరసన

ధారూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ధారూరు స్టేషన్ గ్రామం ఓ కాలనీలో బోర్ మోటార్ చెడిపోయి తాగునీటికి ఇబ్బందులు తలెత్తాయి. బోర్ మోటార్ మరమ్మతులకు అధికారులు చర్యలు తీసుకోకపోవటంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు తెలిపారు. సోమవారం మహిళలు ఖాళీ బిందెలు, బకెట్లు రోడ్డుపై పెట్టి నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలోని శ్మశాన వాటిక పక్కనున్న కాలనీ బోర్‌మోటార్ చెడిపోయి మూడు రోజులవుతోందని యువకులు తెలిపారు. నీటి కోసం పక్క కాలనీల బోర్ల వద్దకు వెళ్తున్నామని ప్రజలు చెప్పారు. మోటార్‌ను బాగు చేయించాలని నాయకులను కోరినా పట్టించుకోవటంలేదని, పంచాయతీ కార్యదర్శి అందుబాటు లేరని, పంచాయతీకి తాళం ఉందన్నారు. మండల పరిషత్ అధికారులకు తెలిపినా స్పందన లేదని వాపోయారు. మోటార్‌కు మరమ్మతు చేయించి నీటి సమస్య తీర్చాలని కోరారు.

అడవిని తగలబెడితే కఠిన చర్యలు


తగలబడుతున్న అడవి

ధారూరు, మార్చి17(ఆంధ్రజ్యోతి): ధారూరు అటవీ రేంజ్‌లో రాత్రి పూట కొందరు అడవిని తగలబెడుతున్నారని, అటవీప్రాంతాన్ని ఆక్రమించేందుకే ఇలా చేస్తున్నారని రేంజర్ రాజేందర్ సోమవారం తెలిపారు. ఇలాంటి చర్యలకు పాల్పడినా, అసైన్డ్ పేరిట అడవిని నరికినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అడవిలో చెట్లు నరికి, చదును చేసేందుకు వచ్చే ట్రాక్టర్లు, డోజర్లు, జేసీబీలను సీజ్‌చేసి కోర్టుకు అప్పగిస్తామని చెప్పారు. విలేకరులతో మాట్లాడుతూ.. రేంజ్‌లోని దోర్నాల, సంగాయిపల్లి తండా, రాస్నం, జుంటుపల్లి, గంగాసాగర్, అడాల్పూర్, తిమ్మాయిపల్లి, బాణాపూర్, బిజ్వారం, కమాల్‌పూర్, పగిడ్యాల పరిధిలో కొందరు రాత్రి పూట ఆడవికి నిప్పు పెట్టిఆ రాత్రికిరాత్రి చదును చేసి ఆక్రమిస్తున్నారని చెప్పారు. అడవిని ఆక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. అడవులను రక్షించేందుకు ప్రజలు, యువత సహకరించాలని చేశారు.

బీజేపీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి

వికారాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): భారతీయ జనతా పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ కె.రాజశేఖర్‌రెడ్డిని నియమించారు. సోమవారం పార్టీ రాష్ట్ర ఎన్నికల అధికారి ఎండల లక్ష్మీనారాయణ, కో-రిటర్నింగ్ అధికారి గీతామూర్తి ప్రకటించారు. మూడు అసెంబ్లీ నియోజకవర్గాలకు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులను ఎంపిక చేశారు. పరిగికి కాతన్‌పల్లి అంజిలయ్య, వికారాబాద్‌కు రాచ శ్రీనివాస్‌రెడ్డి, తాండూరుకు బాలి శివకుమార్‌ను నియమించారు. జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి ఎన్నేపల్లిలోని మా శారద ఆసుపత్రి డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు.

కమలంలో కల్లోలం?!

రాజశేఖర్‌రెడ్డి పార్టీలో చేరిన ఏడాదిలోనే పార్టీ జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వడం పట్ల సీనియర్ నాయకులు మండిపడుతున్నారు. అధ్యక్ష పదవికి కె.శివరాజ్, టి.సదానందరెడ్డి, యు.రమేష్‌కుమార్, కేపీ.రాజు, ఇటీవల పార్టీలో చేరిన వడ్ల నందు, కొప్పు రాజశేఖర్‌రెడ్డి పోటీ పడ్డారు. ప్రధాన పోటీ శివరాజ్, రమేష్‌కుమార్ మధ్య ఉందనుకున్నారు. వీరిని కాదని రాజశేఖర్‌రెడ్డికి జిల్లా పార్టీ అధ్యక్ష పదవిని ఎలా ఇస్తారంటూ సీనియర్లు భగ్గుమంటున్నారు. రాజశేఖర్‌రెడ్డి జిల్లాకు స్థానికుడు వాసి కాదని, అధ్యక్ష పదవికి ఆయన దాఖలు చేసిన నామినేషన్నే తిరస్కరించాలని సీనియర్లు ఎన్నికల అధికారికి సోమవారం ఫిర్యాదు చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ కోసం పనిచేయని వ్యక్తికి జిల్లా అధ్యక్ష పదవి ఎలా ఇస్తారంటూ ప్రశ్నిస్తున్నారు. ఇంత వ్యతిరేకత మధ్య పార్టీని ఎలా ముందుకు తీసుకు వెళతారంటూ ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలో తాము వెనక్కి తగ్గేది లేదని, రాష్ట్ర నాయకులతో అమీతుమీ తేల్చుకుంటామంటూ వారు అల్టిమేటం ఇచ్చారు.

రంగారెడ్డి రూరల్ జిల్లా అధ్యక్షుడిగా పతంగి రాజ్‌భూపాల్‌గౌడ్

రంగారెడ్డి అర్బన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): బీజేపీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా ఇప్పటికే రాష్ట్రంలో కొన్ని జిల్లాకు అధ్యక్షులను ప్రకటించింది. సోమవారం రంగారెడ్డి జిల్లా రూరల్ అధ్యక్షుడిగా పతంగి రాజ్‌భూపాల్‌గౌడ్‌ను నియమించారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర ఎన్నికల అధికారి ఎండల లక్ష్మీనారాయణ ప్రకటించినట్లు జిల్లా ఇన్‌చార్జి ఎన్నికల అధికారి కట్ట సుధాకర్‌రెడ్డి తెలిపారు. శంషాబాద్ మండలం పాలమాకులకు చెందిన రాజ్‌భూపాల్‌గౌడ్ 1995 నుంచి బీజేపీ, యువమోర్చాల్లో వివిధ స్థాయిల్లో పదవులు నిర్వహించారు. ఐదు సార్లు సర్పంచ్‌గా పనిచేశారు. అలాగే ఆయన కుటుంబీకులు ప్రజా ప్రతినిధులుగా సేవలందించారు.

మాడిపోతున్నం సారూ..


వికారాబాద్: ద్యాచారంలో ఉపాధి పనుల్లో కూలీలు

(5వ పేజీ తరువాయి)

ప్రస్తుతం ఉదయం 7గంటలకు పనులకు వెళ్లి 10గంటల వరకు కూలీలు ఇళ్లకు వెళ్తున్నారు.

పంపిణీ చేయని పరికరాలు

ఉపాధి పనులకు ఉపయోగించే పరికరాలను కూలీలకు పంపిణీ చేయాల్సి ఉంది. కానీ, జిల్లాలో ఎక్కడా సామగ్రి పంపిణీ చేయని పరిస్థితి. గడ్డపార, పార, గంపలు పంపిణీ చేయక ఏళ్లు గడిచిపోయాయి. దీంతో తప్పక కూలీలే సామగ్రిని సమకూర్చుకుంటున్నారు. కూలీలకు ప్రమాదం జరిగితే ప్రాథమిక చికిత్స అందించేందుకు ఫస్ట్ ఎయిడ్ బాక్సులు అవసరం. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంత వరకు ఎక్కడ కూడా ఫస్ట్ ఎయిడ్ కిట్లు పంపిణీ జరగలేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే కనీస వసతులకు నోచుకోవడం లేదని కూలీలు ఆరోపిస్తున్నారు.


తాండూరులో ఉపాధి పనుల్లో కూలీలు

చెట్ల కింద సేద తీరుతూ..

వికారాబాద్ నియోజకవర్గంలో ఉపాధి హామీ పనులు అన్ని గ్రామాల్లో చురుకుగానే కొనసాగుతున్నాయి. 59,065 జాబ్ కార్డులు ఉన్నాయి. వాటిలో 43,291 యాక్టివ్‌గా ఉన్నాయి. నియోజకవర్గంలో 2,926 మంది కూలీలు ఇంత వరకు 100 రోజుల పనిని పూర్తి చేశారు. ద్యాచారం, కోట్‌పల్లి, మోమిన్‌పేట, చక్రంపల్లి, గడ్డమీది గంగారం తదితర గ్రామాల్లో ఆంధ్రజ్యోతి క్షేత్రస్థాయిలో పరిశీలించింది. ఎక్కడ కూడా కనీస వసతులు లేకుండానే కూలీలు పనులు చేపడుతున్నట్లు గుర్తించారు. అలిసిపోయిన కూలీలు చెట్ల కింద సేద తీరాల్సిన పరిస్థితి. వేసవిలో పనులు చేస్తున్నందుకు ప్రత్యేక అలవెన్స్ సైతం ఇవ్వడం లేదని పలువురు కూలీలు వాపోయారు.

ఏళ్లుగా ఇదే దుస్థితి..

కొడంగల్ నియోజకవర్గంలోని కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాల్లో 28,671 జాబ్ కార్డులు ఉండగా, 4,350 మంది కూలీ పనులకు హాజరవుతున్నారు. ఇంత వరకు 1,255 మంది 100 రోజులు పూర్తి చేసుకున్నారు. ఏళ్లుగా టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు, గడ్డపారలు, పారలు, గంపలు ఇవ్వడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొడంగల్ మండలంలోని 8,612 జాబ్ కార్డులు ఉండగా 1,300 మంది కూలీ పనులకు హాజరవుతున్నారు. బొంరాస్‌పేట మండలంలో 7,252 జాబ్ కార్డులు ఉండగా 1,500 మంది కూలీ పనులకు హాజరవుతున్నారు. దౌల్తాబాద్ మండలంలో 12,807 జాబ్ కార్డులు ఉండగా 1,550 మంది కూలీ పనులకు హాజరవుతున్నారు. కాగా 88 మంది 100 రోజుల పని పూర్తి చేసుకున్నారు.

వేసవి భృతి చెల్లించాలి

పనులు చేసేచోట్ల కనీస సౌకర్యాలు కల్పించాలి. పారలు, గంపల కోసం అలవెన్స్ ఇవ్వాలి. దీంతో పాటు వేసవి భృతి చెల్లించాలి. ఫస్ట్ ఎయిడ్ మెడికల్ కిట్లు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలి. ఎండ తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. పనికి వెళ్లాలంటే భయం వేస్తోంది. ఇప్పటికైనా అధికారులు టెంట్లు ఇవ్వాలి.

- వెంకటయ్య, కూలీ, ఎర్రన్‌పల్లి, కొడంగల్ మండలం


దోమ: ఊటుపల్లి గ్రామంలో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

నర్సరీల్లో మొక్కల పెంపకం పనులు

తాండూరు నియోజకవర్గంలో ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు ఉపాధి కూలీలు పని చేస్తున్నారు. నాలుగు మండలాల్లో 40,670 జాబ్‌కార్డులు ఉండగా 12,249 మంది పనులు చేస్తున్నారు. కూలీలు సొంతంగా సామగ్రి తెచ్చుకుని చేస్తున్నట్లు క్షేత్ర స్థాయి పరిశీలనలో తేలింది. టెంట్లు, తాగునీటి వసతి, ఫస్ట్ ఎయిడ్ కిట్లు ఎక్కడా అందుబాటులో లేవు. తాండూరు మండలం కొత్లాపూర్‌లో పలువురు కూలీలు ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ఎండల్లో ఇంత కష్టపడి పనిచేస్తే ఇచ్చే కూలి గిట్టుబాటు కావడం లేదని వాపోయారు. కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉందని వాపోయారు. ప్రస్తుతం గుట్టల్లో గుంతలు తీయడం నర్సరీల్లో మొక్కల పెంపకం పనులు కొనసాగుతున్నాయి.

నీడ, తాగునీటి వసతి కల్పించే బాధ్యత పంచాయతీలదే..



ఉపాధి పనులు కొనసాగే చోట కూలీలకు నీడ కల్పించే టెంట్లు, తాగునీటి వసతి ఏర్పాటు చేసే బాధ్యత పంచాయతీలకు అప్పగించాం. అందుకు అయ్యే ఖర్చుల బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ మేరకు అన్ని మండలాల ఎంపీడీవోలకు లేఖలు కూడా రాశాం. పనులు జరిగే చోట్ల కూలీలు డీ హైడ్రేట్ కాకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాం. పనులు చేపట్టే సమయంలో ప్రమాదవశాత్తు ఏమైనా గాయాలైతే ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేసుకునే సదుపాయం కల్పించారు.

- శ్రీనివాస్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ మహిళ మృతి

దోమ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని సంవత్సరాలుగా మానసికంగా బాధపడుతూ క్రిమిసంహారక మందు సేవించి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ మహిళా మృతి చెందిన సంఘటన దోమ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన దొబ్బలి మైబమ్మ (55) గతంలో ఓ కుమారుడు, కూతురు మృతి చెందడంతో అప్పటి నుంచి మానసికంగా బాధపడుతుంది. ఈ క్రమంలో ఆదివారం ఉదయం క్రిమిసంహారక మందు సేవించింది. గమనించిన కుటుంబ సభ్యులు కోస్గి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమమంగా ఉండటంతో అక్కడి నుంచి మహబూబ్‌నగర్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. మృతురాలి కూతురు నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆనంద్‌కుమార్ తెలిపారు.

ప్రాణం తీసిన ఈత సరదా


బాలాజీ (ఫైల్)

దోమ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): స్నేహితులతో కలిసి సరదాగా ఈతకు వెళ్లిన ఓ విద్యార్థి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని బుద్లాపూర్ అనుబంధ గ్రామం గోన్యనాయక్ తండాలో జరిగింది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తండాకు చెందిన నేనావత్ శంకర్, కవితల కుమారుడు నేనావత్ బాలాజీ(13) పరిగి కృష్ణవేణి టాలెంట్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవురోజు కావడంతో స్నేహితులతో కలిసి బొంరాస్‌పేట్ మండలంలోని కాకరవాణి ప్రాజెక్టులో ఈతకు వెళ్లాడు. బాలాజీ ఈత కొడుతున్న సమయంలో ఆకస్మాత్తుగా నీటిలో మునిగిపోయాడు. గమనించిన స్నేహితులు వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో వారు తండాకు వెళ్లి విషయాన్ని బాలాజీ తల్లిదండ్రులకు చెప్పకుండా దాచారు. స్నేహితులు, తల్లిదండ్రులు బాలాజీ ఆచూకీ కోసం ఎంత వెతికినా కనబడకపోవడంతో తల్లిదండ్రులు స్నేహితులను ఆరా తీశారు. తమకు తెలియదని చెప్పడంతో తల్లిదండ్రులు దోమ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేపట్టగా అందరం కలిసి ఈతకు వెళ్లామని ఆ తర్వాత చెరువులో బాలాజీ కనబడలేదని సమాధానమిచ్చారు. సోమవారం ఉదయం ప్రాజెక్టులో శవమై బాలాజీ మృతదేహం కనిపించడంతో మృతదేహాన్ని పరిగి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆనంద్‌కుమార్ తెలిపారు.

విద్యార్థి అదృశ్యం


చంద్రశేఖర్

కులకచర్ల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండవెల్కిచర్ల గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో విద్యార్థి అదృశ్యమైన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. చౌడాపూర్ మండలంలోని పచావ్‌కుంట తండాకు చెందిన బద్రునాయక్ కుమారుడు మూడవత్ చంద్రశేఖర్ బండవెల్కిచర్ల గిరిజన గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 15న రాత్రి పాఠశాల నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. విద్యార్థి కనిపించకపోవడంతో పాఠశాల యజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరు దొంగలు రిమాండ్

● పరారీలో మరో ఇద్దరు

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేయగా మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. క్రైం ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీ పరిధి మర్రిపల్లిగూడలో గత నెల 26న దుర్గమ్మ ఆలయంలోని హుండీ చోరీ జరిందగని ఆలయ కమిటీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు సీసీపుటేజీల ఆధారంగా జవహర్‌నగర్, కార్మికనగర్‌కు చెందిన పసునూరి నవీన్(20), గబ్బిపేటకు చెందిన మహ్మద్ సలీం(19), సాయి, సంతోష్‌లుగా గుర్తించారు. సోమవారం పసునూరి నవీన్, మహ్మద్ సలీంలను పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితులు మద్యానికి అలవాటు పడి దొంగతనాలు చేస్తున్నారని చెప్పారు. నిందితుల నుంచి రెండు బైక్‌లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న ఇద్దరిని త్వరలో పట్టుకుంటామని, ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తాగునీటి ఇబ్బందులు రానివ్వం

ఫటాఫట్

● పరిగి మునిసిపల్ కమిషనర్ వెంకటయ్య



పరిగి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా పరిగి పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని పరిగి మునిసిపల్ కమిషనర్ వెంకటయ్య తెలిపారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు.

ఆంధ్రజ్యోతి: నీటి సమస్య లేకుండా తీసుకుంటున్న చర్యలు ఏమిటి.?

కమిషనర్: వేసవిని దృష్టిలో పెట్టుకుని ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటి వరకు 72బోర్లను వినియోగంలోకి తీసుకొచ్చాం.

ఆంధ్రజ్యోతి: నీటి ఎద్దడి ఆరోపణలపై మీరేమంటారు?

కమిషనర్: వాస్తవమే. ప్రతీవ్యక్తికి రోజుకు 137 లీటర్లు ఇవ్వాలి. నిత్యం 3.61 ఎంఎల్‌డీ వాటర్ రావాల్సి ఉంది. 1.67 ఎంఎల్‌డీ నీళ్లు మిషన్‌భగీరథ ద్వారా, బోర్ల ద్వారా ఒక ఎంఎల్‌డీ ఇస్తున్నాం. ఒక ఎంఎల్‌డీ కొరత ఉంది.

ఆంధ్రజ్యోతి: నీటి కొరతను ఎలా అధిగమిస్తారు?

కమిషనర్: సమస్య తీవ్రంగా ఉన్న చోట్ల ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తాం. ట్యాంకర్ల కొరత లేదు. కొత్తగా విలీనమైన గ్రామాలను కలిపి ఐదు ట్యాంకర్లు ఉన్నాయి. వాటితో నిత్యం సరఫరా చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లేదా?

కమిషనర్: అమృత్-2 కింద రూ.15.59 కోట్లతో ట్యాంకులు, పైపులైన్ పనులు కొనసాగుతున్నాయి. దసరానాటికి పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌పై ఒత్తిడి పెంచుతాం. ఇవీకాకుండా పూర్తిగా సరఫరా లేని తిరుమల రెసిడెన్సీ, భవానినగర్, మైత్రీనగర్, తదితర కాలనీల్లో ఎమ్మెల్యే సహకారంతో కొత్తగా బోర్లు వేసి నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: ఎల్ఆర్ఎస్‌పై స్పందన ఎలా ఉంది?

కమిషనర్: ఊహించినంతగా స్పందన లేదు. పరిగి మున్సిపల్ పరిధిలో 3069 దరఖాస్తులు వచ్చాయి. వాటిని రెగ్యులరైజ్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాయి. 25శాతం రాయితీపై ప్లాంట్ల ఉన్నవారి దగ్గరకు వెళ్లి ఎల్ఆర్ఎస్ చేయించుకోవాలని అవగాహన కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: మున్సిపాలిటీలో పన్ను వసూళ్ల పరిస్థితి?

కమిషనర్: పన్ను వసూళ్ల పరిస్థితి మెరుగ్గా ఉంది. ఏటా పన్నుల ద్వారా రూ.కోటీ 80లక్షల 56వేల డిమాండ్ ఉంది. రూ.1.71కోట్లు వసూలు చేశాం. నెలాఖరు నాటికి వందశాతం పూర్తి చేస్తాం.

బీమాతో కార్యకర్తలకు ధీమా


చెక్కును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్

వికారాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ బీమాతో కార్యకర్తలకు ధీమా కల్పిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. మండలంలోని పులుమద్ది గ్రామంలో సోమవారం ఇటీవల మృతి చెందిన నల్ల యాదయ్య కుటుంబాన్ని పరామర్శించి బీఆర్ఎస్ పార్టీ నుంచి మంజూరైన రూ.2లక్షల బీమా చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మహిపాల్, పట్టణ అధ్యక్షుడు గోపాల్ పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: మోమిన్‌పేట్ మండలంలోని దుర్గం చెరువు గ్రామ మాజీ ఉప సర్పంచ్ కిష్టయ్య, గూడుపల్లి శ్రీనివాస్ ఇటీవల మృతి చెందడంతో మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించారు. అనంతరం దేవరంపల్లిలో ఓ దశదిన కర్మలో పాల్గొన్నారు. వారి వెంట శ్రీకాంత్ గౌడ్, తిరుపతిరెడ్డి, కుశాల్‌కుమార్, హరిశంకర్, సీహెచ్.కృష్ణ, అబ్రహం పాల్గొన్నారు.

ఓ కాలనీ నిధులతో మరో కాలనీలో పనులా?


వినతిపత్రం కాపీని చూపిస్తున్న గ్రామస్తులు

బొంరాస్‌పేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్కెపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో సీసీరోడ్డు, డ్రైనేజీ పనులకు రూ.15లక్షలు మంజూరు కాగా పనులు మాత్రం వేరే కాలనీలో చేపట్టడం సరికాదని కాదని కాలనీవాసులు ఆరోపించారు. ఈ విషయంపై గత నాలుగు రోజులుగా కలెక్టర్, ఎంపీడీవో, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అయినప్పటికీ అభివృద్ధి పనుల్లో కాలనీ పట్ల వివక్ష చూపిస్తూ వేరే కాలనీలో పనులు ఎలా చేపడతారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు ఎల్లప్ప, కృష్ణ, గోపాల్, శేఖర్, ఉన్నప్ప, దస్తప్ప, వెంకటప్ప, వెంకటప్ప, మొగులప్ప పాల్గొన్నారు.

కర్మాగారం పరిసరాల్లో ట్రాప్ కెమెరాల ఏర్పాటు


మల్కాపూర్ అదానీ సిమెంట్స్ పరిధిలో ట్రాప్ కెమెరా ఏర్పాటు చేస్తున్న అధికారులు

తాండూరురూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్కాపూర్ అల్ట్రాటెక్ సిమెంటు కర్మాగారం పరిసర ప్రాంతాల్లో పులిపిల్ల సంచరిస్తున్నట్లు వస్తున్న పుకార్లతో అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. తాండూరు అటవీ రేంజ్ అధికారి శ్రీదేవిసరస్వతి ఆదేశాల మేరకు సెక్షన్ ఆఫీసర్ పీర్యానాయక్, బీట్ అధికారి మల్లయ్యలు సోమవారం ఆ ప్రాంతంలో ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశారు.

తాగునీరు రావడం లేదని నిరసన

తాండూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : 2వ వార్డులో తాగునీరు రావడంలేదని సీపీఎం ఆధ్వర్యంలో కాలనీ మహిళలు సోమవారం తాండూరు మున్సిపాలిటీ ఎదుట నిరసనకు దిగారు. రెండు రోజులుగా తమ కాలనీలో నీరురాక ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోక పోవడంతో మున్సిపాలిటీకి వచ్చి నిరసన చేయాల్సి వచ్చిందని మహిళలు పేర్కొన్నారు. ఇందిరానగర్‌లో బోరింగ్ మరమ్మతులు చేపట్టి తాగునీటి సమస్యలు పరిష్కరించాలని కమిషనర్‌ను కలిసి కోరారు. మంగళవారం సాయంత్రంలోగా నీటి సమస్యను తీర్చాలని లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని మహిళలు హెచ్చరించారు.

మహిళా సంఘం గ్రామ కమిటీ ఎన్నిక

దుద్యాల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మహిళా సంఘం గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఐకేపీ సీసీ సంజీవ్‌కుమార్ తెలిపారు. స్థానిక ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో సోమవారం మహిళా సంఘం సభ్యుల సమావేశం నిర్వహించారు. అధ్యక్షురాలిగా గోవిందమ్మ, కార్యదర్శిగా అనిత, కోశాధికారిగా ఫౌజియా, ఉపాధ్యక్షురాలిగా అంజమ్మ, సహాయ కార్యదర్శిగా జగ్గమ్మ తదితరులను ఎన్నుకున్నారు. వీవోఏ కృష్ణ పాల్గొన్నారు.

యాదవులు అన్ని రంగాల్లో రాణించాలి

దుద్యాల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): యాదవులు అన్ని రంగాల్లో రాణించాలని యాదవ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. దుద్యాల గ్రామ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాల్‌రాజ్, ప్రధాన కార్యదర్శిగా మొగులయ్య, ఉపాధ్యక్షులుగా బుగ్గప్ప, మల్లయ్య, కార్యదర్శులుగా తిరుమలయ్య, అంజమ్మ, బాలమణి, గౌరవ అధ్యక్షుడిగా మల్లయ్య, సలహాదారుడిగా కాశప్పతో పాటు పలువురిని సభ్యులుగా ఎన్నుకున్నారు

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

కీసర, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కీసరగుట్టలోని ఆర్య వైశ్య నిత్యాన్నదాన సత్రంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బెలిదె రమేష్ గుప్తా ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కీసర మాజీ ఉపసర్పంచ్ శ్రావణ్ గుప్తా పాల్గొన్నారు.

రైతులకు పట్టాలు అందించాలి

మోమిన్‌పేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కబ్జాలో ఉన్న రైతులందరికీ పట్టా పాస్‌బుక్‌లు అందించాలని సీపీఎం ఆధ్వర్యంలో గ్రామస్థులు, నాయకులు సోమవారం ఎంపీవో యాదగిరికి వినతిపత్రం అందజేశారు. కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్.మహిపాల్ మాట్లాడుతూ.. మండలంలోని కేసారంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, ఆనంద్, మానెయ్య, స్టాలిన్, నర్సింహులు పాల్గొన్నారు.

రావల్‌కోల్‌ను మున్సిపాలిటీగా మార్చాలి

మేడ్చల్ టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) మండలంలోని రూరల్ పంచాయతీలను కలుపుతూ ఎల్లంపేట మున్సిపల్‌కు బదులుగా రావల్‌కోల్ మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని మేడ్చల్ జిల్లా సీపీఎం కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సీపీఎం పార్టీ నేతలు కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయండి

తాండూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 31వ వార్డులో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరుతూ మాజీ కౌన్సిలర్ బంటారం లావణ్య ఫిర్యాదు చేశారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం సూపరిండెంట్‌కు ఫిర్యాదును అందజేశారు. ఆమె వెంట బీజేపీ నాయకులు భద్రేశ్వర్ ఉన్నారు.

రాజశేఖర్‌రెడ్డి నామినేషన్ తొలగించాలి


ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

వికారాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుడి ఎన్నికకు సంబంధించి డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి నామినేషన్‌ను తొలగించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. బీజేపీ ఎన్నికల అధికారి శ్రీనివాస్‌కు సోమవారం వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి స్థానికుడు కాదని, ఆయన గద్వాల్ జిల్లా వాస్తవ్యుడని తెలిపారు. ఆయన వికారాబాద్ జిల్లా అధ్యక్ష ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా నామినేషన్ వేశారని, ఆయన నామినేషన్‌ను తిరస్కరించాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాదవరెడ్డి, ప్రహ్లాద్‌రావు, శివరాజు, శ్రీనివాస్, వడ్ల నందు, రమేష్ కుమార్, శిరీష, కేపీరాజు, విజయ్ భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలకు మేలు

కీసర, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలకు మేలు జరుగుతుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు అన్నారు. ఎస్సీ వర్గీకరణ జరిగే వరకు గ్రూపు-1, 2, 3, ఇతర ప్రభుత్వ ఉద్యోగ పరీక్షలు వాయిదా వేయాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కీసరలో నిరసన దీక్ష జరుగుతుంది. నిరసన కార్యక్రమం సోమవారానికి 7వ రోజు కావడంతో దీక్షకు సంఘీభావం తెలుపడానికి గోవిందు విచ్చేసి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదించి తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. .

రేపు ఆశావర్కర్ల కలెక్టరేట్ ముట్టడి

యాలాల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం (రేపు) కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని ఆశా వర్కర్లు తెలిపారు. ఈ మేరకు సోమవారం యాలాల మండల పరిధిలోని ఆశావర్కర్లు తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు సులోచన, సరిత, పద్మమ్మ పాల్గొన్నారు.

కోట్‌పల్లి: ఆశావర్కర్ల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా 15రోజులు నిరవధిక సమ్మె చేపట్టినా ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేదని కోట్‌పల్లి ఆశావర్కర్లు తెలిపారు. తహసీల్దార్ శ్రీనివాస్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈనెల 19న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

పేదలకు అండగా ప్రభుత్వం

కులకచర్ల: ప్రభుత్వం పేద ప్రజలను ఆదుకుంటుందని మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.అంజనేయులు తెలిపారు. మండలంలోని అనంత సాగర్ గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సోమవారం ముగ్గులు పోశారు. ఆయన వెంట డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి ఉన్నారు.

నాగారం జడ్పీహెచ్ఎస్‌లో వార్షికోత్సవం

కీసర రూరల్: నాగారం జడ్పీహెచ్ఎస్ ఆవరణలో సోమవారం పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. హెచ్ఎం రాములు మాట్లాడుతూ.. ఇక్కడి బోధనా సిబ్బంది ప్రత్యేక బోధనతో పదో తరగతిలో విద్యార్థులు ఉన్నతమైన ఫలితాలను సాధిస్తున్నారన్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మనోహర్ పాల్గొన్నారు.

మిట్టకోడూర్ కోలాట కళాకారులకు ప్రశంసలు

పరిగి రూరల్: మిట్టకోడూర్ కోలాట కళాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ఆదివారం రవీంద్రభారతిలో జరిగిన అంతర్జాతీయ మహిళ దినోత్సవ పురస్కారాలు కార్యక్రమంలో భాగంగా అభినవ ఆర్ట్స్ అకాడమి సహకారంతో మిట్టకోడూర్ కోలాట కళాకారులు ప్రదర్శన ఇచ్చి ప్రశాంస పత్రాలు అందుకున్నారు.

పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి

మోమిన్‌పేట్: రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఇన్‌చార్జి ఏఈవో చంద్రిక అన్నారు. మండలంలోని టేకులపల్లి రైతు వేదికలో సోమవారం పంటల నమోదుకు అందుబాటులో ఉంటామన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

యాలాల: మండల పరిధిలోని జుంటుపల్లి రామస్వామి ఆలయాన్ని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ఆర్‌బీటీఎల్ సీఈవో బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి దర్శించుకున్నారు. సోమవారం రామస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కళాకారుడికి బెస్ట్ డ్యాన్సర్‌గా గుర్తింపు

తాండూరు: కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చినందుకు తాండూరు జానపద కళాకారుడు ఎల్.అశోక్‌ను అభినందించారు. ఈమేరకు సోమవారం తాండూరులో ఆయన కేంద్ర సంస్కృతి మంత్రిత్వ శాఖ జాయింట్‌సెక్రటరీ ఉమా నందూరి అందుకున్న సర్టిఫికెట్‌ను మీడియాకు విడుదల చేశారు. 'ది లార్జెస్ట్ ఇండియాన్ ఫోక్ వైరటీ డ్యాన్స్' కింద ప్రదర్శించిన ప్రదర్శనకు గుర్తిస్తు సంగీత్ నాటక్ అకాడమి అవార్డును అందజేశారని పేర్కొన్నారు.

సీసీఐ జీఎంను కలిసిన ఏఐటీయూసీ నాయకులు

తాండూరు రూరల్: కరన్‌కోట్ సీసీఐ కర్మాగారంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏఐటీయూసీ కార్మిక సంఘం నాయకులు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు.

ప్రజల సమస్యలు పరిష్కరించండి

తాండూరు: ప్రజల కనీస సౌకర్యాలు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం వినతిపత్రాన్ని సమర్పించారు.

ఉద్యోగ విరమణ తప్పదు

చౌడాపూర్: ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ తప్పదని ఎంఈవో రాంచందర్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న భాగ్యవతి పదవీ విరమణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆమెను శాలువాలతో సత్కరించారు.

ఘనంగా శివలింగ ప్రతిష్ఠాపన

చౌడాపూర్: చాకల్‌పల్లిలో సోమవారం శివలింగ ప్రతిష్ఠాపనను ఘనంగా నిర్వహించారు. మూడు రోజులు పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పూజల్లో బీజేపీ నేతలు ప్రహ్లాద్‌రావు, కిరణ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న తిరుపతిరెడ్డి

కొడంగల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ మొదలైందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాల వద్ద అభివృద్ధి పనులను కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డితో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, ఎంఈవో రాంరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆసిఫ్‌ఖాన్ ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ధారూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సమాజంలో జరుగుతున్న వివిధ రకాల నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ అనిత తెలిపారు. మండల పరిధిలోని మోమిన్‌ఖుర్దు గ్రామంలో సోమవారం ప్రజలతో ఆమె సమావేశమై నేరాల నివారణపై అవగాహన కల్పించారు. ఇళ్లు, దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో గ్రామపెద్దలు, ప్రజలు, యువకులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదవాలని ఇన్‌చార్జి ఎంఈవో శ్రీధర్ అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, అంకుశాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం పదో తగరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యార్థులకు పాఠాలు చెప్పినట్లు గుర్తుచేశారు. అదేవిధంగా పరీక్షా పేపర్‌లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనంతయ్య, వనజ, కరుణ, రాజశేఖర్, నవనీత, క్యాథ్రిన్, లక్ష్మీ, సురేందర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

మోమిన్‌పేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మనోహరచక్రవర్తి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో రెండు దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.